
బహుముఖ ప్రజ్ఞాశాలి, స్వాతంత్ర్య సమరయోధులు, భారతరత్న

# మౌలానా అబుల్ కలాం ఆజాద్



సయ్యద్  నశీర్ అహమ్మద్

బహుముఖ ప్రజ్ఞాశాలి, స్వాతంత్ర్య సమరయోధులు, భారతరత్న

# మౌలానా అబుల్ కలాం ఆజాద్

సయ్యద్ నశీర్ అహమ్మద్

ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్
ఉండవల్లి - 522 501

బహుముఖ ప్రజ్ఞాశాలి, స్వాతంత్ర్య సమరయోధులు, భారతరత్న

# మౌలానా అబుల్ కలాం ఆజాద్

Versatile Genius, Freedom Fighter, Bharatharathna, Moulana Abul Kalam Azad

MOULANA ABUL KALAM AZAD

Syed Naseer Ahamed

**All Rights Reserved with Writer**

ప్రచురణ సంఖ్య : 19

ముద్రణ : 2020

ముఖపత్రాలంకరణ : యన్. జయరాజు, వినుకొండ

టైపు సెట్టింగ్, ముద్రణ : జయదీప్తి గ్రాఫిక్స్, వినుకొండ.

**ప్రతులకు :**

MR. ZAKEER HUSSAIN

Nellore Dist Incharge

**SEEMANDHRA MUSLIM WELFARE ASSOCIATION**

Ist Floor, Basha Masjid Complex, Chinna Bazar,

NELLORE-524001, Nellore Dist., Andhrapradesh

Mobile : 9246420786

**ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్**

ఫ్లాట్ నం. సి-2, శ్రీరామ్స్ ఆర్కేడ్, అమరావతి రోడ్,

**ఉండవల్లి - 522 501,**

తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా. ఆంధ్రప్రదేశ్

దూరవాణి: +91 9440241727

Mail:

naseerahamedsyed@gmail.com,

**వెల : అమూల్యం**

## ఆత్మీయులు...



## షేక్ మస్తాన్ వలి

**(1968–2020)**

గారికి

# అంకితం

**షేక్ మస్తాన్ వలి :** కడపలో అడుగుపెట్టగానే ఆత్మీయంగా పలకరించే స్నేహితులు షేక్ మస్తాన్ వలి. 1968 జూన్ 23న కడప జిల్లా ముద్దనూరు గ్రామంలోని షేక్ గౌసున్నీసా బేగం, షేక్ మహబూబ్ సాహెబ్ లకు జన్మించారు. బాల్యం నుండి క్రమశిక్షణతో చదివి బి.ఎ పట్టభద్రులయ్యారు. సామాజిక స్పృహను నరనరాన ఒంట బట్టించుకున్న ఆయన వామపక్ష విద్యార్థి సంఘాలలో ప్రముఖ పాత్ర పోషించారు. ప్రజాశక్తి దినపత్రిక విలేకరిగా బాధ్యతలు చేపట్టి నిబద్ధతతో సుదీర్ఘకాలం పనిచేశారు. తెలుగు సాహిత్యంలోని చైతన్యవంత సాహిత్యాన్ని ప్రజలకు చేరువ చేయడం కోసం ఎన్నో సాహిత్య సమావేశాలు మరెన్నో సామాజిక చైతన్య సభలను నిర్వహించారు. అటు సమాజాన్ని ఇటు కుటుంబాన్ని సమంగా ప్రేమించిన షేక్ మస్తాన్ వలి స్వయంగా పరిశోధకుడు, రచయిత. సామాజిక–చారత్రిక పరిశోధన పట్ల ఆమితాసక్తిగల ఆయన 2009లో 'మన కడప', 2010లో 'సీమ అందాలు' అను గ్రంథాలను వెలువరించారు. ఆయన తన రచనల ప్రచురణకు వరకు మాత్రమే పరిమితం కాకుండా పలువురు యువ రచయితల రచనల ప్రచురణకు కూడా చేయూతనందించారు. ఆర్థిక–సాంఘిక అసమానతలు లేని సామ్యవాద వ్యవస్థ ఏర్పాటు దిశగా అహర్నిశలు కృషి చేస్తున్న రాజకీయ–సాహిత్య–సాంస్కృతిక–సామాజిక–సేవా సంస్థలతో కలసి పని చేశారు. ప్రజాహిత సాహిత్య–సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ పట్ల అమితాసక్తి చూపుతూ పలు కార్యక్రమాలను నిర్వహించారు. మంచి సాహిత్యం, సాహిత్యవేత్తల పట్ల అపార ప్రేమాభిమానాలు చూపుతూ ఆ సాహిత్యాన్ని ప్రజలకు పరిచయం చేయాలన్న సంకల్పంతో విస్తృతంగా అనేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కడప కేంద్రంగా పనిచేస్తున్న సాహిత్య–సాంస్కృతిక–సేవా సంస్థలతో స్నేహపూర్వక సంబంధాలు నెరుపుతూ పనిచేశారు. ధార్మికంగా ఇస్లామియా ఆధ్యాతిక చింతన గల షేక్ మస్తాన్ వలి ధార్మిక–సామాజిక సేవలు అందిస్తూ, అవసరార్థులను ఆదుకుంటున్న పలు ధార్మిక, సేవా సంస్థలలో భాగస్వామిగా ఆపన్నులకు సహాయపడ్డారు. ప్రజలలో సకారాత్మక చైతన్యం కోసం అనునిత్యం శ్రమిస్తూ, ఆచరణాత్మక కార్యక్రమాల నిర్వహణలో నిరంతరం నిమగ్నమౌతూ, స్నేహశీలత, నిజాయితీ, నిబద్ధత, కార్యదక్షతను మనస్సు నిండా నింపుకుని ప్రజానీకంతో మమేకమై ప్రజల కోసం ప్రజలతో కలిసి మెలసి చివరి వరకు క్రియాశీలకంగా తన సేవలందించిన షేక్ మస్తాన్ వలి 2020 అక్టోబర్ 26న కన్నుమూశారు. ◆



## Sri. K. V. N. CHAKRADHAR BABU IAS

DISTRICT COLLECTOR & MAGISTRATE

SRI POTTI SREERAMULU NELLORE DISTRICT, AP

సత్యం, ధర్మం, త్యాగం, చైతన్యం విలువలతో కూడిన నిర్ణయానికి మూల స్థంభాలయినప్పుడు అది బలీయమైన ఉక్కు సంకల్పమై నిలుస్తుంది. ఎందరో త్యాగధనులు స్వాతంత్ర్య సమరంలో బ్రిటిష్ వారికి ఎదురొడ్డి నిలబడ్డారు. వారిలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఒకరు. ఆయన పోరాట పటిమ ఎనలేనిది. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని అరెస్టులకు సైతం వెనుకాడని ధీరత్వం తనది. ఆయన దార్శనీయకత శ్లాఘనీయం. భారతదేశం నుండి పాకిస్థాన్ విడిపోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించడం ఆయన దూరదృష్టికి నిదర్శనం. ఆయన లౌకికతత్వం అనుసరణీయం. అలాంటి ఉత్తమ భావాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవడం ఇప్పుడు అత్యావశ్యకం.

మౌలానా ఆజాద్ గొప్ప విద్యావేత్త. విద్య వ్యక్తి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతుందని భావించిన దార్శనికుడు. విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి విద్యావ్యవస్థలో అనేక సంస్కరణలు ప్రవేశ పెట్టారు. అవి ఇప్పటికి అనుసరించదగ్గవే. అప్పట్లోనే స్త్రీ విద్యకు అత్యంత ప్రాధాన్యత నిచ్చారు. విద్యాశాఖకు బడ్జెట్ పెంచడం అనేది భావి భారతాన్ని అత్యున్నత స్థాయికి చేర్చడమే అవుతుంది. ఆయన కవి, రచయిత, మానవతావాది, అత్యున్నత లౌకిక భావాలు గల వ్యక్తి. అకళంక దేశభక్తులు. ఒక ఉత్తమ వ్యక్తికి ఉండవలసిన అన్ని లక్షణాలు గల మౌలానా అబుల్ కలాం ఆజాద్ బహుముఖ ప్రజ్ఞాశాలి. ఉత్తమ దృష్ట.సృష్ట.

భారతీయులందరికి దీపధారిగా ఉండదగిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ మహోన్నత వ్యక్తిత్వాన్ని పరిచయం చేయాలన్న సదుద్దేశ్యంతో ఆయన 132వ జయంతిని పురస్కరించుకుని మౌలానా జీవిత విశేషాలను సంక్షిప్తంగా అక్షరీకరించి **'బహుముఖ ప్రజ్ఞాశాలి, స్వాతంత్ర్య సమరయోధులు, భారతరత్న : మౌలానా అబుల్ కలాం ఆజాద్'** శీర్షికతో పుస్తకాన్ని వెలువరిస్తున్న చరిత్రకారులు, బహుగ్రంథ రచయిత శ్రీ సయ్యద్ నశీర్ అహమ్మద్ అభినందనీయులు. శ్రీ నశీర్ అహమ్మద్ రూపొందించిన పుస్తకం ప్రచురణకు హార్థిక–ఆర్థిక భారాన్ని స్వీకరించడం మాత్రమే కాకుండా, పుస్తకం ఖరీదు అమూల్యమని ప్రకటించి, ప్రజలకు ప్రధానంగా విద్యార్థులకు, యువతకు తమ చిరుకానుకగా పంపిణి చేయాలని సంకల్పించిన **' సీమాంధ్ర ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ '** బాధ్యులకు ఈ సందర్భంగా ప్రత్యేకాభినందనలు.

**అభినందనలతో ....**

జిల్లా కలెక్టరు మరియు మెజిస్ట్రేట్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా



**Sri. SYED ABDUL HAMEED**
DISTRICT MINORITIES WELFARE OFFICER
SRI POTTI SREERAMULU NELLORE DISTRICT, AP

**భా**రతరత్న, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ 132 వ జన్మదినోత్సం సందర్భంగా ఆయన జీవిత విశేషాలతో కూడిన **'బహుముఖ ప్రజ్ఞాశాలి, స్వాతంత్ర్య సమర యోధులు, భారతరత్న : మౌలానా అబుల్ కలాం ఆజాద్'** పేరిట పుస్తకం వెలువడటం సంతోషదాయకం. మౌలానా ఆజాద్ గారు ఎంతో అద్భుతమైన మనీషి. ఆయన వ్యక్తిత్వం ఎంతో ఉన్నతమైనది. భారతీయులకు నిర్భరతను నేర్పి, మాతృభూమి స్వాతంత్ర్య సిద్ధికి పాటుపడిన మహనీయుడు.

ప్రతికూల పరిస్థితులలో కూడా గుండె దిటవు చేసుకుని ఆత్మ విశ్వాసంలో ముందుకు నడిచిన, ప్రజలను మున్ముందుకు నడిపించిన ధీశాలి. ఆయన జీవితంలోని కొన్ని సంఘటలను చదివితే, ప్రస్తుత పరిస్థితులలో విద్యార్థుల నుండి దేశ నాయకుల వరకూ ప్రతీ ఒక్కరికి అవి తప్పకుండా పాఠాలుగా ఉపయోగ పడతాయన్నది వాస్తవం. భారతదేశానికి మౌలానా ఆజాద్ అపురూపమైన ప్రతినిధి. అభ్యుదయానికి చదువే కీలకమని నినదించిన మహనీయుడు. ఆ దిశగా నిర్మాణాత్మక కృషిని నెరపిన ఆదర్శమూర్తి.

ఆ మహా మనీషి జీవితం లోని ప్రత్యేకంగా పేర్కొనదగిన విశేషాంశాలను వివరిస్తూ పుస్తకంగా రూపొందించి మనకు అందించారు ప్రముఖ చరిత్రకారుడు, బహుగ్రంథకర్త శ్రీ సయ్యద్ నశీర్ అహమ్మద్. ఈ పుస్తకంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ సంక్షిప్త పరిచయం విద్యార్థులకు తప్పకుండా ప్రేరణ కల్గిస్తుందని, వారి జీవితాలతో పెద్ద మలుపును తెస్తుందని మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను. ఈనాటి యువతకు ఆయన జీవిత కార్యాచరణ మార్గదర్శకం కాగలదని ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను.

ఈ సందర్భంగా శ్రీ సయ్యద్ నశీర్ అహమ్మద్ గారిని అభినందిస్తున్నాను. శ్రీ నశీర్ అహమ్మద్ రూపొందించిన ఈ పుస్తకం ప్రచురణకు హర్థిక–ఆర్థిక భారాన్ని స్వీకరించడం మాత్రమే కాకుండా, పుస్తకం ఖరీదు అమూల్యమని ప్రకటించి, ప్రజలకు ప్రధానంగా విద్యార్థులకు, యువతకు ఈ గ్రంథాన్ని తమ సంస్థ చిరుకానుకగా రెండు తెలుగు రాష్ట్రాలలో పంపిణి చేయాలని, గ్రంథాలయాలకు అందించాలని నిర్ణయించి ఆ మేరకు తగిన ఏర్పాట్లకు సమాయత్తం అవుతున్న **' సీమాంధ్ర ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ '** బాధ్యులకు అభినందనలు తెలుపుతున్నాను. .

**అభినందనలతో ....**

SAHameed
DMWO
SPS Nellore.

జిల్లా మైనారటీస్ సంక్షేమ అధికారి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.



**భా**రత జాతీయోద్యమం దశను, దిశను నిర్దేశించి, స్వరాజ్య సాధనలో అగ్రభాగాన నిలిచి విక్రమించి, జనహృదయాధి నేతలుగా శాశ్వత ఖ్యాతి నార్జించిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులలో అగ్రగణ్యులు మౌలానా అబుల్ కలాం ఆజాద్. ఆయన పూర్వీకులు మొగల్ చక్రవర్తి బాబర్ కాలంలో హీరత్ నుండీ ఆగ్రా వచ్చారు. ఆ తరువాత మొగల్ రాజుల కొలువులో ఉన్నతాధికారులుగా, పండితులుగా పలు బాధ్యతలు నిర్వహించారు. 1857 నాటి ప్రథమ స్వాతంత్ర్య సమరం తరువాత అబుల్ కలాం ఆజాద్ తండ్రి, మౌలానా ఖైరుద్దీన్ బ్రిటీష్ పాలకుల దాష్టికాలను భరించలేక అరేబియాకు వెళ్ళిపోయారు. మూడు దశాబ్దాల తర్వాత ఆయన భారతదేశానికి వచ్చి కలకత్తాలో స్థిరపడ్డారు. ఆయన అరేబియాలో ఉన్నప్పుడు అబుల్ కలాం 1888 నవంబర్ 11న మక్కాలో జన్మించారు. ఆయన తల్లి పేరు ఆలియా. మౌలానా ఆజాద్ అసలు పేరు **అబుల్ కలాం గులాం ముహియుద్దీన్ అహ్మద్ బిన్ ఖైరుద్దీన్ అల్ హుసైని ఆజాద్**. పాశ్చాత్య విద్యకు పూర్తి వ్యతిరేకి అయినటువంటి తండ్రి ఆయనకు సాంప్రదాయక విద్యను గరిపాక, కైరోలోని అల్-అజహర్ విశ్వ విద్యాలయంలో అబుల్ కలాం ఉన్నత విద్యను పూర్తి చేసారు. ఆ తరువాత సర్ సయ్యద్ అహమ్మద్ భావాలకు ఆకర్షితులైన ఆజాద్ పాశ్చాత్య విద్యను అభ్యసించనిదే తన విద్య సంపూర్ణం కాదని భావించారు. విద్యావంత సమాజం మాత్రమే ప్రగతి పథంలో సాగగలదని విశ్వసించిన ఆయన తండ్రికి తెలియకుండా ఆంగ్ల భాషను రహస్యంగా అభ్యసించారు. మౌలానాకు పలు పాశ్చాత్య ఆధ్యాత్మిక, తాత్విక గ్రంథాలు పరిచయం అయ్యాయి.

స్వేచ్ఛా-స్వాతంత్ర్యాలను అభిలషించే అబుల్ కలాం తన పేరుకు 'ఆజాద్'ను జోడించుకున్నారు.

మౌలానా ఆజాద్ మతం, వేదాంతం, ఖగోళ, రసాయన తత్త్వశాస్త్రాలను అభ్యసించారు. అరబిక్, పర్షియన్, టర్కిష్ భాషలలో పాండిత్యం సంపాదించి బహుముఖ ప్రతిభావంతుడిగా ఖ్యాతిగాంచారు. పదకొండు సంవత్సరాల వయస్సులో కలం చేపట్టి, 12వ ఏట 'నైరంగ్-ఎ-ఆలం' అను కవితా పత్రికను ప్రారంభించారు. ఆయన తన పదమూడవ ఏట 'తక్‌కిరె-సదిక్య' సాహిత్య విమర్శను సృజించయించి, '...విద్యాఖని, సలక్షణ శోభితుడు, మహాకవి, సాటిలేని విద్వాంసుడు...' అని పలు ప్రశంసలందుకున్నారు. సాంప్రదాయిక సాహిత్య రీతులకు, ప్రచురణ పద్ధతులకు అతీతంగా తనదైన ప్రత్యేక సాహిత్య బాటను నిర్మించుకున్నారు. పదిహేను సంవత్సరాల వయస్సు నాటికి పలు పత్రికలు స్వయంగా నడపటమేకాకుండా, ప్రముఖ పండితులు నడుపుతున్న పత్రికలలో వ్యాసాలు, కవితలు రాసి ప్రతిభావంతుడైన సాహిత్యవేత్తగా ఖ్యాతిగడించారు. ప్రముఖ కవి అల్తాఫ్ హుస్సేన్ హాలీ, ఒకసారి మౌలానాను చూడవచ్చి, తాను చూడదలచిన మహాకవి, ఆ నూనూగు మీసాల పసివాడేనని తెలుసుకుని సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారట. మౌలానా అజాద్ ఆజాద్ చిన్న వయస్సులో సాహిత్యవేత్తగా చూపిన అసమాన ప్రతిభకు కితాబుగా శ్రీమతి సరోజనీ నాయుడు, ' He was fifty the day he born ' అని వ్యాఖ్యానించారు.

ఒక వైపు సాహిత్యవేత్తగా కృషి సాగిస్తూ మరోవైపున ఆనాటి ముస్లిం జన సముదాయాల పరిస్థితులను, పరాయి పాలకుల దుశ్చర్యలను గమనిస్తూ వచ్చిన ఆయనకు సమాజాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని కలిగిన కోర్కె , '...కాలక్రమాన స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనే నిశ్చయ శక్తిగానూ, దేశ సమైక్యతను కాపాడలన్న పట్టుదలనూ పెంపొందించింది'. ఆ లక్ష్యాల దిశగా పయనించే క్రమంలో మౌలానా అబుల్ కలాం 1904లో అఖిల భారత ముస్లిం విద్యా సదస్సులో, అఖిల భారత ముస్లిం పత్రికా సంపాదకుల సమావేశాల్లో జరిగిన చర్చలు ఆయనలో జాతీయ భావనలను ప్రోదిచేసాయి. 1906 లో ఢాకాలో జరిగిన ముస్లిం లీగ్ సమావేశాలకు ఆయన హాజరయ్యారు. ఆ తరువాత మౌలానా కొంతకాలం ముస్లిం లీగ్ ఆలోచనలతో కలసి పయనించారు.

ఆనాడు భారత జాతీయ కాంగ్రెస్ అనుసరిస్తున్న మెతక విధానాలు ఆయనకు నచ్చలేదు. మౌలానా అజాద్‌కు శ్రీ శ్యామ సుందర చక్రవర్తి అను విప్లవకారుడు బెంగాల్‌లోని విప్లవ సంస్థలను పరిచయం చేసాడు. బెంగాల్ విప్లవకారులు ప్రారంభంలో ఆయనను

నమ్మలేదు. ఈ విషయాన్ని, 'At first they did not fully trust me and tried to keep me outside their inner councils. In course of time they realised their mistake and I gained their confidence' అని తన గ్రంథం India Wins Freedom, పేర్కొన్నారు. ఆజాద్ ఆలోచనల, ఆచరణల ప్రభావంతో విప్లవ సంఘాల పరిధి బెంగాల్-బీహార్ దాటి బొంబాయి, ఉత్తర భారత దేశంలోని పలు పట్టణాలకు వ్యాపించింది.

1908లో మౌలానా అబుల్ కలాం ఇరాక్, సిరియా, ఈజిప్ట్, టర్కీ, తదితర ప్రాంతాలను పర్యటించారు. పలు విద్యాసంస్థలను, ప్రముఖ విప్లవకారులను కలుసుకున్నారు, ఆ పర్యటనలో గడించిన అనుభవాలతో తిరిగివచ్చిన ఆజాద్ భారతదేశాన్ని పరాయిపాలన నుండి విముక్తి కలిగించేందుకు రాజకీయ పోరాటం ప్రారంభించాలని, ఆ పోరాటంలో హిందూ-ముస్లిం జనసముదాయాలు ఏకమై పరాయి పాలకుల మీద సమర శంఖారావం పూరించాలని ఆకాంక్షించారు. ఈదిశగా ప్రజల్లో ప్రధానంగా ముస్లింలలో చైతన్యం కలిగించేందుకు 'అల్ హిలాల్' ఉర్దూ పత్రికను 1912 జూలై 13న ప్రారంభించారు. ఆనాటి పత్రికలకు భిన్నమైన గెటప్‌లో, శక్తిమంతమైన భావాలతో, ఉత్తమ లక్ష్యంతో, విషయం ప్రజల హృదయాలలో సూటిగా నాటుకునే వీలుగల భాషతో, నూతన శైలితో అల్ హిలాల్ పాఠకులను అమితంగా ఆకట్టుకుంది. మూడు మాసాల కాలంలో అల్ హిలాల్ పాత సంచికలన్నిటినీ తిరిగి ప్రచురించాల్సి వచ్చిన ఈ పత్రిక రెండు సంవత్సరాల కాలంలో 26 వేల సర్క్యులేషన్‌కు చేరుకుని, ఆనాటి ప్రముఖ పత్రికలలో అగ్రగామిగా నిలచింది, స్వరాజ్య సాధనకు హిందూ-ముస్లింలు కలసికట్టుగా ఉద్యమించాలని ప్రజలను కోరిన మౌలానా '...For the Hindus patriotism might be a secular obligations, but for the Muslims it was religious duty... ' అని ప్రకటించారు.

మాతృదేశ విముక్తి కోసం సాగే పోరాటంలో ప్రాణాలను సైతం అర్పించగల యువకులతో 'భగవంతుని పార్టీ' (హిజ్‌బుల్లా) అను రహస్య సంస్థను మౌలానా అజాద్ ప్రారంభిచారు. ఈ సంస్థలో చేరిన యువకులచే, మాతృదేశ సేవలో తమ సర్వం త్యాగం చేస్తామని, ఖుర్‌ఆన్ మీద, ఖిద్దిపూర్ స్మశానంలో ప్రమాణాలు చేయించారు. బ్రిటీష్ పాలకులకు విధేయులుగా వ్యవహరిస్తున్న సంస్థలు, వ్యక్తులనే దృష్టిలో పెట్టుకుని 'అల్ హిలాల్'లో 'భారత దేశంలో రాజకీయ విప్లవం చెలరేగి, దేశం తనకు తానై బిగించుకున్న దాస్య శృంఖలాలు తానే ఛేదించుకుని ఇరవయ్యవ శతాబ్ధిలో స్వతంత్ర వాయువులను పీల్చే రోజు తప్పక వస్తుంది'. ప్రగాఢ విశ్వాసాన్ని వ్యక్తంచేశారు.



**జాతిపిత మహాత్మాగాంధీతో చర్చలు సాగిస్తున్న మౌలానా అబుల్ కలాం ఆజాద్**

బ్రిటీషర్లకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతులను చేస్తున్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ కార్యక్రమాల మీద, ఆయన ప్రారంభించిన పత్రిక మీద ఆంగ్లేయ పాలక వర్గాల క్రూర దృష్టి పడింది. అదిరింపులు-బెదిరింపులు సాగకపోవటంతో పత్రిక ప్రచురణకు కట్టిన డిపాజిట్టును జప్తుచేసారు. చివరకు 1914 నవంబర్‌లో అల్ హిలాల్‌ను ఆంగ్ల ప్రభుత్వం మూసి వేయించింది. మౌలానా చేతులు కట్టుకుని కూర్చోలేదు. అల్ హిలాల్ స్థాయిలో, 'అల్ బలాగ్' అను మరో ఉర్దూ పత్రికను తీసుకొచ్చారు. ఆ పత్రికను కూడా ప్రభుత్వం మూయించి, భారత రక్షణ నిబంధనల క్రింద మౌలానాను 'ప్రమాదకర వ్యక్తిగా' పరిగణించి, కలకత్తా నగరం నుండి బహిష్కరించింది. మౌలానా ఆజాద్ బీహర్ లోని రాంచి వెళ్ళిపోగా, రాంచి విడిచి బయటకు వెళ్ళరాదని ఆంక్షలు విధించింది. ఆ సమయంలో 'తజ్‌కిరా' అనే అమూల్య గ్రంథాన్ని మౌలానా ఆజాద్ రాశారు.

1920 జనవరిలో ప్రవాసం జీవితం నుండి విముక్తుడైన మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఢిల్లీ వచ్చి మొదటిసారిగా మహాత్మాగాంధీని కలుసుకున్నారు. ప్రథమ ప్రపంచ యుద్ధం ముగిసి, విజేతల పక్షమైన బ్రిటీష్ పాలకవర్గాల ఆకృత్యాల కారణంగా దేశంలో 'ఖిలాఫత్-సహాయనిరాకరణ' ఉద్యమాలకు బీజాలు పడ్డాయి. మహాత్మాగాంధీ, అలీ

సోదరులు ప్రజలను ఉద్యమీకరించేందుకు నడుంకట్టి ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు. గాంధీజీ చారిత్రాత్మక 'సహయ నిరాకరణ' ఉద్యమానికి పిలుపు నిచ్చారు.

ఈ రకమైన ఉద్యమ కార్యాచరణ గురించి అంతకుముందుగా తన పత్రికలో ప్రస్తావించి ఉన్నందున, I also remmember that I had myself suggested a similar programme in some articles in Al Hilal (India Wins Freedom, 1988, Page 10) అని ప్రకటిస్తూ గాంధీజి పిలుపుకు ప్రతిస్పందిస్తూ, మరో ఆలోచనలేకుండా ఖిలాఫత్-సహాయ నిరాకరణ ఉద్యమంలో మౌలానా ఆజాద్ ప్రవేశించారు. ప్రముఖ ఇస్లాం ధార్మికవేత్తగా, రచయితగా, వక్తగా ఖ్యాతిగాంచిన మౌలానా దేశమంతటా విస్తృతంగా పర్యటిస్తు, ప్రజలను ఉద్యమంలో భాగస్వాములు గావించారు.

ఇస్లాం ధర్మశాస్త్రంలో ఆయనకున్న అపార జ్ఞానంతో, ప్రత్యర్థుల వాదనను బలంగా తిప్పికొట్టి, ప్రజలను పీడీస్తున్న పాలకుల మీద, హిందూ-ముస్లింలు కలసి కట్టుగా పోరాడాల్సిందిగా పిలుపు నిచ్చారు. అవమానాలతో బ్రతుకీడ్చే కంటే పోరాడుతూ గౌరవంగా వీరోచితంగా మరణాన్ని స్వీకరించటం మంచిదని, ముహ్మద్ ప్రవక్త (స.అ.సం) నిర్ధేశించిన బాటలో నడవాల్సిదింగా ముస్లింలను కోరుతూ ఉత్తేజపర్చారు. ఆయన పిలుపుకు మంచి స్పందన లభించింది.

సామాన్య ప్రజలు మాత్రమే కాదు, 1920లో లాహోర్‌లో పదివేల మంది ఉలేమాలు సమవేశమై మౌలానా ఆజాద్ చూపిన బాటలో సాగడానికి సిద్ధపడ్డారు. మౌలానా పట్ల గౌరవాన్ని వ్యక్తంచేస్తూ ఆయనకు 'అమీరుల్ హింద్', ఇమాముల్ హింద్ (భారత నాయకుడు) బిరుదునిచ్చేందుకు ప్రయత్నించగా మౌలానా సున్నితంగా తిరస్కరించారు. ఆయనను Quaid-i - Azam అని కూడా పిలిచారు. ఆ తరువాతి కాలంలో అఖిల భారత ముస్లిం లీగ్ నాయకుడు ముహమ్మద్ ఆలీ జిన్నా అదే బిరుదుతో ప్రసిద్ధిగాంచడం విశేషం.

ఖిలాఫత్-సహాయనిరాకరణ ఉద్యమంలో ఉద్యమిస్తున్న మౌలానా ఆజాద్‌ను 1921 డిసెంబర్ 10న ప్రభుత్వం నిర్బంధించింది. సహాయనిరాకరణ ఉద్యమ ఆదేశాలకు అనుగుణంగా ఆయన న్యాయస్థానంలో వాదోపవాదాలలో పాల్గొనకుండా, 'అంతిమ నిర్ణయం' అను మకుటంతో ఒక నివేదిక కోర్టుకు సమర్పించారు. ఆ నివేదికలో, స్వేచ్ఛ అన్నది ప్రతి జీవికి జన్మత: లభించిన హక్కు ఏ మానవుడికి కాని, భగవంతుని సృష్టిలోని జీవుల్ని బంధనాలలో ఉంచే అధికారం లేదు. బంధనాలలో ఉన్నవారికి ఏ ఆకర్షణలు చూపించినా బానిసత్వం బానిసత్వమే. ఇది భగవంతుని ఇచ్ఛకు వ్యతిరేకం. కనుక ప్రస్తుత ప్రభుత్వం

నిజమైన ప్రభుత్వమని నేను అంగీకరించను. నా దేశాన్ని నా ప్రజల్ని ఈ బానిసత్వం నుండి విముక్తుల్ని చేయడం, నా జాతీయ, ధార్మిక, మానవతా బాధ్యత, విధిగా నేను భావిస్తున్నాను. స్వతంత్ర బీజం మొలకెత్తాలంటే హింస, అణిచివేత రూపంలో నీరు లభించాలని నా ఉపన్యాసాలలో చాలా సార్లు చెప్పాను. ప్రభుత్వం ఈ బీజానికి ఇప్పుడు నీళ్లు పోస్తోంది, అని ప్రకటించారు.

మౌలానా వ్యక్తం చేసిన అభిప్రాయాలను గాంధీజీ బహువిధాల కొనియాడుతూ, తన 'యంగ్ ఇండియా' లో '...the most forceful and truthful statement offered by a sathyagrahi...' అని పేర్కొన్నారు. చివరకు మౌలానాకు సంవత్సరం జైలుశిక్ష చాలా తక్కువని ఆయన వ్యాఖ్యానించగా, ఆయన సతీమణి శ్రీమతి జులేఖా బేగం ఈ విషయమై గాంధీజీకి ఒక టెలిగ్రాము పంపుతూ, '..This is noticeably less than what we were prepared for ... you will agree that injustice has been done to him in this respect...' అని పేర్కొన్నారు. మౌలానా ఆజాద్‌కు 13 ఏండ్ల వయస్సులో జులేఖా బేగంతో వివాహం జరిగింది. అరబిక్ ప్రాథమిక జ్ఞానం గల ఆమె పర్షియన్, ఉర్దూబాషలో ప్రావీణ్యురాలు. భర్త అడుగుజాడలో నడవటమే కాదు, ఆయన అన్ని విధాల ప్రోత్సహించి తోడ్పాటు అందించిన మహనీయురాలు.

1923 జనవరి మాసంలో మౌలానా విడుదలయ్యారు. చౌరీచౌరాలో జరిగిన హింసాత్మక సంఘటనలను పురస్కరించుకుని, ఉధృతంగా సాగుతున్న ఉద్యమాన్ని విరమిస్తూ గాంధీజీ ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయంతో ఆయన ఏకీభవించలేదు. అహింసను ఒక సిద్ధాంతంగా కాకుండా ఒక విధానంగా మాత్రమే ఆజాద్ అంగీకరించారు. '...For me, non-violence was a matter of policy, not of creed, my view was that Indians had the right to take to the sword if they had no other alternative. It would be however be noble to achieve independence through peaceful means...' అన్నారు.

బ్రిటీష్ పాలకుల మీద ఐక్యంగా పోరాడాల్సిన హిందూ-ముస్లింలు అంతర్గత సంఘర్షణలలో కూరుకుపోయి ఉన్నారు. శాసనసభలలో ప్రవేశించాలని ఒక వర్గం, మరో వర్గం వాదులాడుకుంటూ, భారత జాతీయ కాంగ్రెస్ విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటుంది. ఆ సమయంలో, 1923లో ఢిల్లీలో జరిగిన జాతీయ కాంగ్రెస్ సమావేశాలకు 35 ఏండ్ల వయస్కులైన మౌలానా అబుల్ కలాం ఆజాద్ అధ్యక్షత వహించారు. అంత చిన్న వయస్కుడెవ్వరూ అప్పటి వరకు భారత జాతీయ కాంగ్రేస్ అధ్యక్ష పదవి నిర్వహించక పోవటంతో అది విశేషాంశం అయ్యింది. భారత దేశంలోని విభిన్న సాంఘీక జన

సముదాయాల మధ్య ఐక్యతను ప్రగాఢంగా వాంఛించిన, మౌలానా అధ్యక్షోపన్యాసంచేస్తూ 'ఈనాడు భారత దేశానికి హిందూ మతశక్తిగాని, ముసల్మాన్ మతశక్తిగాని అవసరం లేదు. ఇప్పుడు ఒకే ఒక శక్తి, అది భారత జాతీయ కాంగ్రెస్' అన్నారు. ప్రస్తుతం స్వరాజ్యం కంటే హిందూ-ముస్లింల ఐక్యత అత్యంత ప్రధానమని ప్రకటించారు. ఇండియాకు స్వరాజ్యం లభించటంలోఆలస్యమైతే ఇండియాకు మాత్రమే నష్టం, హిందు-ముస్లింల ఐక్యతకు భంగం వాటిల్లితే అది యావత్తు మానవ జాతికి నష్టం కాగలదని హెచ్చరించారు.

ఈ విషయాన్ని, '...if an angel descends from the heaven today and proclaims from the Qutub Minar that India can attain Swaraj within 24 hours provided I relinquish my demand for Hindu-Muslim unity, Ishall retort to it: No my friend, I shall give up Swaraj, but not Hindu-Muslim unity, for if Swaraj is delayed, it will be a loss for India but if Hindu-Muslim unity is lost, it will be loss for the whole of mankind..' (Understanding The Muslim Mind, Rajmohan Gandhi, Penguin Books, Page.230) అని కధాత్మకంగా తన ఆలోచనలను మౌలానా ఆజాద్ వ్యక్తం చేశారు.

ఈ మేరకు హిందు-ముస్లిల ఐక్యతకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చిన మౌలానా అబుల్ కలాం విభిన్న మతస్థుల మధ్యన స్నేహ సంబంధాల పటిష్టత కోసం శ్రమించారు. మత మనోభావాలను రాజకీయ రంగం మీదకు తెచ్చినప్పుడు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని హెచ్చరించారు. 1923 నుండి 30 వరకు హిందూ-ముస్లింలు స్వరాజ్యం కోసం కలసికట్టుగా పోరాడటం కాకుండా అంతర్గత విభేదాలలో మునిగిపోయారు. 1927లో మహమ్మద్ అలీ జిన్నా, మౌలానా ముహమ్మద్ అలీలు కాంగ్రెస్-ముస్లీం లీగ్‌ల మధ్య సమోధ్య కోసం సాగించిన ప్రత్యేక కృషికి మౌలానా ఆజాద్ తోడ్పాటు అందించారు.

1927లో సైమన్ కమీషన్ బహిష్కరణ ఉద్యమంలో మౌలానా ఆజాద్ కీలక పాత్ర వహించారు. జాతీయోద్యమాన్ని పూర్తిగా సమర్ధించే 'జమాయత్-ఉల్-ఉలేమా' సంస్థ తొలి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. జమాయత్ కార్యక్రమాలను స్వాతంత్ర్యోద్యమం దిశగా సాగేందుకు మార్గదర్శకత్వం వహించారు. 1928లో హిందూ - ముస్లిం సమస్యల పరిష్కారానికి పండిట్ మోతిలాల్ నెహ్రూ నివేదిక చేసిన సూచనలను ఆయన అంగీకరించారు.

1930లో 'సంపూర్ణ స్వరాజ్యం' కోసం భారత జాతీయ కాంగ్రెస్ ఉద్యమించింది. ఆ లక్ష్యసాధనకు రూపుదిద్దుకున్న శాసనోల్లంఘన ఉద్యమంలో ఆయన చురుగ్గా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మీరట్‌లో ఆయన చేసిన ప్రసంగం అభ్యంతరకరంగా ఉందని ఆంగ్ల ప్రభుత్వం అరెస్టు చేసి ఏడాది పాటు కారాగారవాస శిక్ష విధించింది. ఆ తరువాత 1932లో లక్నోలో జరిగిన జాతీయవాదులైన ముస్లిం ప్రముఖుల సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ, బ్రిటీష్ పాలకుల దాస్యం నుండి మాతృదేశాన్ని విముక్తి చేయడం కొరకు, '...స్వతంత్ర సంగ్రామం ప్రారంభమైంది కనుక ముస్లింలు తమ కోరికలను రద్దు చేసుకోవాలి. యుద్ధం ప్రారంభమైనాక ఎంత ధర్మబద్ధమైన కోరికలైనప్పటికీ వర్గ సంబంధమైన కోరికలు ప్రకటించడం సంఘర్షణకే ముప్పు కలిగిస్తుంది...', అందువలన ముస్లింలు తమ చిన్న చిన్న కోర్కెలను విస్మరించాలని మౌలానా కోరారు. ఆ తరువాత జరిగిన రౌండ్ టేబుల్ సమావేశాలు విఫలమయ్యాక, మౌలానా ఆజాద్‌ను శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొనరాదని ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఉల్లంఘించినందుకు ఏడాది పాటు నిర్బంధానికి గురయ్యారు.

1935 నాటి భారత ప్రభుత్వం చట్టం కల్పించిన మంచి అవకాశాన్ని ఉపయోగించుకుని, శాసన సభలలో ప్రవేశించాలని మౌలానా అబుల్ కలాం ఆజాద్ భావించారు. 1937 నాటి ఎన్నికల తరువాత బెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, సింధ్, వాయవ్య సరిహద్దు ప్రాంతాల పార్లమెంటరీ వ్యవహారాల బాధ్యత ఆయనకు అప్పగించగా, ఎంతో చాకచక్యంగా వ్యవహరించి అక్కడి పలు సమస్యలను పరిష్కరించి, కాంగ్రెస్ ప్రభుత్వాలను ఏర్పాటు చేయించారు.

ఆ ఎన్నికల తరువాత ఆనాడు ఉత్తరప్రదేశ్‌కు సంబంధించి ఆయన తీసుకున్న నిర్ణయానికి భిన్నంగా పండిట్ జవహర్‌లాల్ చేసిన ప్రకటన వలన ముస్లిం లీగ్‌కు చాలా మేలు జరిగింది. ఆ చర్య ముస్లింలీగ్ మరింత బలోపేతం కావడానికి దోహదపడింది. ఈ విషయాన్ని మౌలానా ఆజాద్ తన India Wins Freedom గ్రంథంలో, '...Jawaharlal's action gave the Muslim League in the U.P., a new lease of life. All students of Indian politics know that it was from the U.P. that League was recognised. Mr.Jinna took full advantage of the situation and started an offensive which ultimately led to pakistan...' అని పేర్కొన్నారు.

ఆ ఎన్నికలలో ఘోరంగా విఫలమైన ముస్లిం లీగ్ ఎదురుదాడి ప్రారంభించి కాంగ్రెస్ ప్రభుత్వాలను ఇరకాటంలో పెడుతూ కాంగ్రెస్ ప్రభుత్వాలు ముస్లింల సంక్షేమానికి వ్యతిరేకంగా పని చేస్తున్నాయని ప్రచారం ప్రారంభించింది. కాంగ్రెస్ ప్రభుత్వాల మీద ముస్లిం లీగ్ ఆరోపణలు చేస్తూ విడుదల చేసిన 'ఫిర్పూర్ సంఘ నివేదిక' ను విభజించు- పాలించు తత్వం కలిగిన ఆంగ్ల ప్రభుత్వం తన నిర్ణయాలకు అనుకూలంగా వినియోగించుకుంది.

1939 మరోమారు భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని స్వీకరించాల్సిందిగా మౌలానా ఆజాద్‌ను మహాత్మాగాంధీ కోరగా, ఆ పదవిని రెండోసారి చేపట్టిన మౌలానా మనకు స్వాతంత్ర్యం సిద్ధించాక కూడా 1948 వరకు  ఆ పదవిలో కొనసాగి చరిత్ర సృష్టించారు. మాతృభూమికి స్వాతంత్ర్యం రాక ముందు భారత జాతీయ కాంగ్రెస్ ప్రతిష్టాత్మక అధ్యక్ష్య స్థానాన్ని చేపట్టి స్వాతంత్ర్యం సిద్ధించాక కూడా భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్ష్య స్థానంలో కొనసాగిన ప్రత్యేక ఘనతను దక్కించుకున్న ఏకైక స్వాతంత్ర్య సమరయోధులు మౌలానా అబుల్ కలాం ఆజాద్.

1940 మార్చి మాసంలో బీహార్ రాష్ట్రం రాంఘుర్‌లో జరిగిన సమావేశంలో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగా చారిత్రాత్మక ప్రసంగం చేస్తూ, '...**నేను ముసల్మాన్ అయినందుకు ఎంతో గర్విస్తున్నాను. 1300 ఏళ్ళ ఇస్లాం ఉత్తమ సాంప్రదాయాలు నా వారసత్వం. ఈ వారసత్వంలో ఇసుమంతను కోల్పోదానికి నాకిష్టం లేదు. ఇస్లాం బోధనలు, చరిత్ర, కళలు, సాహిత్యం, నాగరికత, ఇవి నా సంపద. వాటిని రక్షించటం నా ధర్మం...అయితే నేను భారతీయుడ్ని కావటం కూడా నాకు గర్వకారణం. విచ్ఛిన్నం కారాని ఐక్యత అన్నట్టి భారత జాతీయతలో నేనొక భాగాన్ని. అతి సుందరమైన ఈ భారత జాతీయత. నేను లేకపోతే అసంపూర్ణమైపోతుంది. భారతదేశ నిర్మాణంలో నేను కూడా ఒక ముఖ్య ఉపకరణాన్ని. ఈ అధికారాన్ని నేను కోల్పోదలచుకోలేదు... ఎన్నో మానవ జాతులు, సంస్కృతులు, మతాలు ఈ దేశం మీదుగా ప్రవహించి, ఈ దేశపు సారవంతమైన నేలలో వెళ్ళానుకుని మొలకెత్తటం చారిత్రకంగా జరుగుతూనే ఉంది. ఏ జాతి, మతం వచ్చినా హృదయపూర్వకంగా స్వాగతం పలికి, ఆ జాతి, మతం ఇక్కడ నెలకొనడానికి ఆస్కారాలు కల్పించిన మహత్తర సంస్కృతి ఈ దేశానిది. ఇస్లాం కూడా ఈ దేశం వచ్చింది. రెండు విభిన్న జాతుల సంస్కృతీ ప్రవాహాల కలయికకు యిది దారితీసింది. గంగా యమునవల వలె కొంతకాలం ఈ రెండు సంస్కృతులు వేర్వేరుగా ప్రవహించి కాలక్రమేణ ప్రకృతి శాసనాలకు లోబడి సంగమంగా రూపొందాయి. మనం, మన సంపదను వెంట తెచ్చుకున్నాం. భారతదేశం కూడా తరతరాల అద్వితీయమైన సంస్కృతీ సంపద కలది. మన సంపదను ఈ దేశానికిచ్చాం. ఈ దేశం తన తలుపులను పూర్తిగా తెరిచింది. తమ సంస్కృతీ సంపదను మనకు ధారాదత్తం చేసింది...భారతదేశపు గడ్డ మీద హిందూ మతానికి ఎంత హక్కు ఉందో ఇస్లాంకు కూడా అంత హక్కు ఉంది... మన భాషలు, మన కవిత్వం, మన సాహిత్యం, మన సంస్కృతి, మన కళలు, అసంఖ్యాకమైన నిత్యజీవిత కార్యక్రమాలు కూడా ఈ సమిష్టి కృషి ముద్రను అనుక్షణం ప్రతిబింబిస్తున్నాయి.**

**మన జీవితాలలో ఈ ముద్ర పడని సంఘటన ఒక్కటి కూడా లేదని చెప్పటం అతిశయోక్తి కాదు. మన భాషలు వేరు. మన కట్టు, బొట్టు, ఆచారాలు వేరు. కాని అవి ఈనాడు పాత పుస్తకాల బొమ్మలలో మాత్రమే కన్పిస్తాయి. ఈ నాటి మన భాష, ఆచార వ్యవహారాలు రెండు గొప్ప జాతుల మేలు కలయికకు చిహ్నం. పదకొండు వందల ఏండ్లనాటి హిందూ సంస్కృతిని కాని, ముస్లిం సంస్కృతిని కాని మళ్ళీ పునరుద్ధరించాలని ఎవరైనా కలలు కంటూ ఉంటే ఆ కల కలగానే మిగిలిపోతుందని...**" మౌలానా ఆజాద్ ప్రకటించారు.

1940లో వ్యక్తి సత్యాగ్రహోద్యమం సందర్భంగా, బ్రిటీష్ పాలకులకు భారతీయులు సహకరించటం తగదని ప్రకటించిన నేరానికి ఆయనను అరెస్టు చేసి, 1941 డిసెంబరులో విడుదల చేసారు. 1942లో 'క్విట్ ఇండియా' ఉద్యమాన్ని ప్రకటించిన మరుసటి రోజుననే ఆయనను ప్రభుత్వం మళ్ళీ అరెస్టు చేసి, అహమ్మద్ నగర్ కోటలో నిర్బందించింది.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జైలులో ఉండగా, ఆయన సతీమణి జులేఖా బేగం తీవ్ర అస్వస్థతకు గురైన వార్తలు ఆయకు అందాయి. ఆమె ఆనారోగ్యాన్ని ప్రస్తావిస్తూ బెయిల్ కోరినట్టయితే ప్రభుత్వం బెయిల్ మజూరుకు సిద్దంగా ఉందని వార్తలు వెలువడ్డాయి. ఆ ఆవకాశం ఉన్నప్పటికి ఆంగ్ల ప్రభుత్వాన్ని బ్రతిమలాడుకుని తనను చూడడానికి స్వాతంత్ర సంగ్రామయోధుడయిన తన భర్త రావాల్సిన అవసరం లేదని బేగం జులేఖా అభిప్రాయపడ్డారు. ఆమెకు నచ్చజెప్పడానికి ఎంతమంది ప్రముఖులు ప్రయిత్నంచినా బేగం జులేఖా ససేమిరా అంటూ తన దృఢన్ఙియాన్ని ప్రకటించారు. ఆ సందర్భంగా భార్య బేగం జులేఖా అభిప్రాయాన్ని గౌరవిస్తూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ బెయిల్ కోసం ఆంగ్ల ప్రభుత్వాన్ని అర్థించలేదు. మహాజర్లు సమర్పించుకోలేదు.

చివరకు మౌలానా ఆజాద్ కడసారి చూపుకు నోచుకోకుండానే 1943 ఏప్రిల్ 19న బేగం జులేఖా కన్నుమూసారు. చిన్న వయస్సులో తనతో వివాహబంధం ఏర్పాటు చేసుకుని ఎన్ని ఇక్కట్లు, ఎన్నో ఇబ్బందులు ఎదురైనా భర్త కార్యక్రమాలకు ఆటంకం కాకుండా మసలుకున్నారు జులేఖా బేగం. ఆ కారణంగా జులేఖా బేగం త్యాగనిరతి, నిబద్దత, స్వాతంత్ర్య సంగ్రామంలో సతతం తన వెంట సాగుతూ తనకిచ్చిన ప్రోత్సాహం గురించి మాట్లాడుతూ, '...నా భావాలను, విశ్వాసాలను పంచు కోవడమేగాక నా జీవితంలో నిజమైన సహచరిణిగా నిలిచింది' అంటూ మౌలానా ఆజాద్ ఆమెకు నివాళులు అర్పించారు.


బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమంలో భారత జాతీయ కాంగ్రెస్ నేతల అరెస్టులు సాగినప్పటికీ ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమించారు.

జాతీయ అంతర్జాతీయ పరిణామాల దృష్ట్యా, చివరకు అధికారాన్ని బదిలీ చేయడానికి బ్రిటీష్ పాలకులు దిగి వచ్చారు. భారతదేశంలో Executive Council ఏర్పాటు చేయాలని సంకల్పించింది. ఈ సమావేశంలో అఖిల భారత ముస్లిం లీగ్ నాయకుడు మహమ్మద్ ఆలీ జిన్నా కారణంగా అటువంటి అవకాశాన్ని భారతీయ ముస్లిం సమాజం కోల్పోయిందని, (...It was because of its (League) opposition that the Muslims of India were denied a substantial share in the Government of undivided India.) మౌలానా ఆజాద్ ఆ తరువాత బాధపడ్డారు. చివరకు సిమ్లా చర్చలు విఫలమయ్యాయి. చర్చలు విఫలమయ్యాక సామాన్య ఎన్నికలు జరుగుతాయని ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు జరిగిన ఎన్నికలలో బెంగాల్, పంజాబ్, సింధ్ ప్రాంతాలలో మినహా అన్ని ప్రాంతాలలో భారత జాతీయ కాంగ్రెస్ ఆధిక్యతను సాధించింది.

బ్రిటన్‌లో జరిగిన ఎన్నికలలో తాము అధికారంలోకి వస్తే భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రకటిస్తామని వాగ్దానం చేసిన లేబర్ పార్టీ అధికారాన్ని చేపట్టింది. భారతదేశానికి స్వాతంత్ర్యం ఇచ్చే విషయం మాట్లాడేందుకు, 1946 మార్చి మాసంలో బ్రిటీష్ క్యాబినేట్ కమిటీ భారతదేశం వచ్చింది. ఈ సందర్భంగా మత కలహాల సమస్యను పరిష్కరించేందుకు, మత సామరస్యాన్ని పటిష్టపర్చేందుకు మౌలానా ఆజాద్ కొన్ని సూచనలను చేసారు. ఆ సూచనలను మహాత్మా గాంధీ శ్లాఘించారు. ముహమ్మద్ అలీ జిన్నా మాత్రం భారత విభజన తప్ప మరిదేనిని అంగీకరించనన్నారు.

ఆ సందర్భంగా ముస్లిం లీగ్ నాయకులలో ఉన్న అనుమానాలను, భయాందోళనలను తొలగించే ప్రయత్నంలో మౌలానా అబుల్ కలాం మట్లాడుతూ, ఇస్లాం ప్రకారం ఈ భూమండలం లోని అన్ని ప్రాంతాలు పవిత్రమైనవే. పాకిస్తాన్‌ల కొన్ని పవిత్రమైనవి మరికొన్ని అపవిత్రమైనవి ఉండవన్నారు. భారతదేశం స్వాతంత్ర్యం సాధిస్తే మతకలహాల సమస్య, మత విద్వేషాలు సమసిపోతాయి. అభిప్రాయ భేదాలున్నా, అవి రాజకీయ–ఆర్థిక అంశాల మీద ఉంటాయి తప్ప మతంతో సంబంధం ఉండవని అభిప్రాయపడ్డారు. చివరకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ మౌలానా ఆజాద్ సూచనల మీద చర్చ జరిపి, క్యాబినెట్ మిషన్ పథకాన్ని అంగీకరించింది. ఆ సమయంలలో పరిస్థితులు అనుకూలంగా లేనందున ముహమ్మద్ అలీ జిన్నా కూడా ఈ పథకాన్ని అంగీకరించారు.

ఆ తరువాత 1946 జులై మాసంలో పండిట్ నెహ్రూ జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుని హోదాలో క్యాబినెట్ మిషన్ పథకంలో పేర్కొన్న అంశాలకు భిన్నంగా మాట్లాడటంతో, లీగ్



**మహాత్మాగాంధీ, జవహర్ లాల్ నెహ్రూలతో మౌలానా అబుల్ కలాం ఆజాద్**

నాయకుడు జిన్నా ఆ ప్రకటనను అవకాశంగా తీసుకుని క్యాబినెట్ పథకాన్ని పూర్తిగా తిరస్కరించి, పాకిస్తాన్ డిమాండ్‌తో విజృంభించాడు. ఈ వాతావరణంతో పరిస్థితులు చేతులు దాటిపోయాయి. పాకిస్తాన్ ఏర్పాటు సంబంధించిన ఎజెండా బలం పుంజుకుంది.

ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, His (Jawaharlal) unfortunate statement that the Congress Would be free to modify the Cabinet Mission Plan reopened the whole question of political and communal settlement. Mr. Jinnah took full advantage of his (Jawaharlal) mistake and withdrew from the League's early acceptance of the Cabinet Mission Plan, మౌలానా అబుల్ కలాం అన్నారు.

1947 మార్చిలో లార్డ్ మౌంట్ బాటన్ వైశ్రాయిగా భారతదేశం వచ్చాడు. భారత దేశానికి స్వాతంత్ర్యం ప్రసాదించే ప్రయత్నాలను వేగవంతం చేస్తున్నానంటూ, భారతదేశ విభజన ప్రయత్నాలను ముమ్మరం చేసాడు. భారత విభజన ఆలోచనను మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న ఆజాద్ జాతీయ కాంగ్రెస్ నేతలు, బ్రిటీష్ పాలక వర్గాలు వ్యక్తంచేస్తున్న భావాల పట్ల ఎంతో ఆవేదన వ్యక్తం చేసారు. పాకిస్తాన్ స్కీమ్ ఇండియాకు మాత్రమే కాదు ముస్లిం ప్రజానీకాన్ని మొత్తంగా పెను ప్రమాదకరం కాగలదని మౌలానా ఆజాద్ హెచ్చరికలు

చేసారు. పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభభాయ్ పటేల్ తదితరులు విభజనకు అంగీకరించటం, సర్దార్ వల్లభాయ్ నోటి వెంట చాలా బలంగా ద్విజాతి సిద్ధాంతం గురించి అనుకూల వ్యాఖ్యానాలు వెలువడటంతో, ఈ విషయమై మౌలానా ఆజాద్ మాట్లాడుతూ, I was surprised that Patel was now an even greater supporter of the two nation theory than Jinnah. Jinnah may have raised the flag of partition but now the real flag bearer was Patel, అని అమితాశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. .

మహాత్మా గాంధీ ప్రారంభంలో విభజనను వ్యతిరేకించినప్పటికీ, చిట్ట చివరకు భారత విభజన వైపు మొగ్గు చూపేసరికి మౌలానా వ్యాకులతకు గురయ్యారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, '...I received the greatest shock of my life to find he changed ...' అని మౌలానా బాధపడ్డారు. భారత విభజన అనివార్యం అన్న వాతావరణవ ఏర్పడిన తరుతవాత కూడా, ఆ ప్రమాదాన్ని తప్పించేందుకు మౌలానా ప్రయత్నం చేస్తూ, స్వాతంత్ర్యాన్ని రెండు సంవత్సరాల వరకు ఆలస్యం చేసినట్లయితే, ముస్లిం లీగ్ ప్రభావం సన్నగిల్లుతుందని ప్రతిపాదించారు. ఈ ఆలోచనను భారత జాతీయ కాంగ్రెస్ లోని వృద్ధనేతలు అంగీకరించ లేదు. చివరకు ఆయన అభీష్టానికి వ్యతిరేకంగా భారతదేశ విభజన జరిగిపోయింది.

మాతృభూమికి 'స్వరాజ్యం' సాధించడం కంటే హిందూ-ముస్లింల ఐక్యతను కాపాడటానికి ప్రధమ ప్రాధాన్యతనిస్తూ, హిందూ-ముస్లిం జనసముదాయాల మధ్య ఐక్యతను ప్రగాఢంగా ఆకాంక్షించిన మౌలానా ద్విజాతి సిద్ధాంతం ప్రాతిపదిక మీద మాతృభూమి చీలి పోవటంతో ఇది తన జీవితంలో పెద్ద అశుభంగా, దుర్ఘటనగా భావించి కృంగిపోయారు.

ఆ తరువాత భారత విభజన నేపధ్యంలో ఆటు-ఇటుజరిగిన మానవ మారణ హోమం, అలనాడు మౌలానా ఆజాద్ చేసిన హెచ్చరికలను నిజం చేయటంతో ఆయన ఎంతో వ్యధకు గురయ్యారు. ఈ దారుణ మారణ కాండతో భారతీయ ముస్లింలు విచలితులయ్యారు. ఈ సందర్భంగా ముస్లిం జనావళిలో ఆత్మస్థయిర్యం కలుగచేస్తూ, 1947-48లో ఢిల్లీ, లక్నోలలో గల మసీదులలో ముస్లిం జన సముదాయాలను ఉద్దేశించి ఆయన అద్భుత చారిత్రక ప్రసంగాలు చేసారు. ఆ ప్రసంగాలలో, **'భారతీయ ముస్లింల మీద ఆపదల తుఫాను విరుచుకు పడడానికి నిస్సందేహంగా ముస్లిం లీగ్ తప్పుడు నాయకత్వం, మహాపరాధాలు కారణం...మీరు ఎవరి మీద నమ్మకం ఉంచారో వారు నేడు మిమ్మల్ని అనాధలను చేసి, విధిరాతల మీద మిమ్మల్ని విడిచి పెట్టి వెళ్ళిపోయారు. భారత దేశ విభజన అన్నది మౌలికంగా చాలా చెడ్డ నిర్ణయం. మతభేదాలను రెచ్చగొట్టిన దాని**

**ఫలితం దురదృష్టవశాత్తు ఇంకా మనం చూస్తూనే ఉన్నాం' అని మౌలానా విమర్శించారు. మతోన్మాద రాజకీయ శక్తుల ప్రయత్నాల గురించి తాను తొలుత నుండి చేస్తూ వచ్చిన హెచ్చరికలను వినలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ, 'మీకు గుర్తుందా? నేను మిమ్ముల్ని ఇక్కడి నుండే సంబోధించాను. మీరు అప్పుడు నా నోరు నొక్కేసారు. నేను నా కలాన్ని ఝుళిపించాను. మీరు నా చేతులను నరికేసారు. నేను నడవదలచుకున్నాను. మీరు నా కాళ్ళను నరికేసారు. నేను మిమ్మల్ని ప్రతి ప్రమాదపు కూడలిలోనూ హెచ్చరించాను. మీరు నా హెచ్చరికను పెడ చెవిని పెట్టబమే కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. తిరస్కరించారు. వ్యతిరేకించారు' అని అన్నారు. అయినా బాధపడ నక్కర లేదని ధైర్యం చెపుతూ, 'ఎవరైతే రుజు మార్గంపై విశ్వాసముంచి స్థిరంగా దానిపై ఉన్నారో వారికి దేనిపట్ల భయం ఉండదు. ఎటువంటి దుఃఖమైనా వారిని కదిలించజాలదు. ఈ విధంగా ప్రమాణం చేయండి, ఈదేశం మాది. మేము ఈదేశం కొరకే ఉన్నాము. ఈదేశపు సౌభాగ్యానికి సంబంధించిన మౌలిక నిర్ణయాలు మా స్వరం లేకుండా లోపభూయిష్టమవుతాయి. మీ భావవేశాలను అదుపులో ఉంచుకోండి. మీ జీవితాలను మీరే తీర్చిదిద్దుకోండి. మార్పులతో బాటుగా పురోగమించండి. మార్పులకు సిద్ధంగా లేమని కుంటిసాకులు చెప్పకండి.పాలకుల నుంచి దేశభక్తి పట్టాలు పొందాలని...నేను కోరుకోవటం లేదు.ఈనాడు భారతదేశంలో కన్పిస్తున్న ఉజ్వలమైన చిహ్నాలు, గుర్తులు మీ పూర్వీకులు వదలిపెట్టిన వారసత్వం. మర్చిపోకండి. పోగొట్టుకోకండి. వాటి నిజమైన హక్కుదార్లమని రుజువు చేసుకుంటూ జీవించండి.మీ అంతట మీరు పారిపోతే తప్ప ప్రపంచం లోని ఏశక్తి కూడా మీచేత ఆ పని చేయించలేదని జ్ఞాపకం ఉంచుకోండి'** అని మౌలానా భారతీయ ముస్లిం సముదాయాలలో ధైర్యం నూరి పోయడానికి ప్రయత్నించారు.

1946లో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడినప్పుడు మౌలానా ఆజాద్ ఎటువంటి బాధ్యతలు స్వీకరించలేదు. స్వతంత్ర భారత ప్రధమ రాష్ట్రపతిగా డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ 1947 జనవరిలో ఎన్నికయ్యాక, మహాత్మాగాంధీ, పండిత నెహ్రూల ఒత్తిడి మేరకు చక్రవర్తుల రాజగోపాలచారి నిర్వహిస్తున్న విద్యాశాఖను ఆయన చేపట్టి మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యారంగానికి ఎనలేని సేవలను అందించారు.

స్వతంత్ర భారతదేశంలో 1952లో ఆయన రాంపూర్ నియోజకవర్గం నుండి పార్లమెంటుకు ఎన్నికయ్యారు. రాంపూర్‌లో ముస్లిం ఓటర్లు ఎక్కువగా గెలుపు సులువని భావించి 1957 ఎన్నికలలో రాంపూర్ నియోజక వర్గాన్ని ఆయనకు కేటాయించారు. జాతీయవాది అటువంటి మౌలానా ఆజాద్ ఆ విశ్లేషణను, నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ. తాను

ఎక్కడి నుండైనా పోటీ చేస్తానంటూ గురుగాం నుండి పోటీచేసి విజయం సాధించి నెహ్రూ మంత్రివర్గంలో మళ్ళీ విద్యాశాఖను చేపట్టి విద్యాశాఖామాత్యులు అయ్యారు.


మౌలానా ఆజాద్ వ్యక్తిగతంగా మత విద్య ఆవశ్యకతను గుర్తించినా, ఆనాటి దేశ పరిస్థితులను బట్టి ప్రభుత్వ పాఠశాలలలో మత విద్యను ప్రవేశ పెట్టడం భావ్యం కాదన్నారు. 1947లో కేవలం రెండు కోట్ల రూపాయలు గల విద్యాశాఖ బడ్జెట్ 1958 నాటికి 30 కోట్లకు పెంచారు. విద్యాశాఖ రాష్ట్రాల జాబితాలో ఉన్నా కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించి విద్యాభివృద్ధికి పెద్ద పీట వేయాలని భావించారు. లలిత కళల పట్ల ప్రత్యేక ఆసక్తి చూపటమే కాకుండా లలిత కళల అభివృద్ధికి పలు అకాడమీలు ఏర్పాటుచేశారు. విద్యాభివృద్ధి కోసం విశ్వవిద్యాలయం గ్రాంట్స్ కమీషన్ లాంటి పలు బృహత్తర సాంకేతిక విద్య, నైపుణ్యాల అభివృద్ధి సంస్థలను స్థాపించారు. స్త్రీ విద్యకు ప్రాధాన్యత కల్పించారు. సాంకేతిక విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపారు. మౌలానా విద్యాశాఖ మంత్రిగా మాత్రమే కాకుండా ఆనాటి ప్రధాని నెహ్రూకు ప్రధాన సలహాదారునిగా, ఉపప్రధాని సర్దార్ వల్లభాయి పటేల్‌కు మధ్యన సమన్వయకర్తగా బృహత్తర బాధ్యతలను నిర్వహించారు.

భారత తొలి విద్యాశాఖామాత్యులుగా మౌలానా ఆజాద్ అందించిన మహత్తర సేవలకు గుర్తింపుగా 2008 సెప్టంబర్ 11న ఆయన పుట్టిన తేది నవంబర్ 11ను 'జాతీయ విద్యాదినోత్సవం' ప్రకటించి ప్రతిఏటా మౌలానా జయంతోత్సవాలు భారత ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఆ క్రమంలో మౌలానా ఆలోచనలను గౌరవిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఆ రోజును 'అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ దినోత్సవం'గా 2005లో ప్రకటించింది. అప్పటి నుండి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కార్యక్రమాలను నిర్వహిస్తూ రావడం ముదావహం.

చిన్నతనం నుండి ప్రముఖ రచయితగా, అద్భుత కవిగా ప్రఖ్యాతి చెందిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ పలు ఉర్దూ పత్రికలను నిర్వహించడం మాత్రమే కాకుండా పలు భాషల్లో అనేక గ్రంధాలను రాసి ప్రచురించారు. 1920లో ఖిలాఫత్ సమస్య మీద Masle-e-Khilapath 1921లో అల్ హిలాల్‌లో ఆయన రాసిన సంపాదకీయాల సంకలనం Davat-e-Amal, 1921లో ఇసాల 1921లో ఇస్లామిక్ రాజ్యం రాజ్యాంగాన్ని Ihrar-e-Islam పేరుతో ప్రచురించారు. 1921లో ఆయన వ్యాసాల సంకలనం Taza mazamin, 1931లో ఆయనకు ఖుర్‌ఆన్ తర్జుమా తదితర పలు పుస్తకాలు ఆయనకు ఎనలేని ఖ్యాతిని తెచ్చి పెట్టినాయి. ఈ గ్రంథాలతోపాటు పుస్తక ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన India Wins Freedom గ్రంథం 1959లో ప్రచురితమయ్యాయి.

ఈ గ్రంథాలే కాకుండా పలు సాహిత్య గ్రంథాలను కూడా ఆయన రాసి ప్రచురించి, పర్షియన్, ఉర్దూ సాహిత్య ప్రపంచంలో మహాకవిగా పండితునిగా, అద్భుత మేధా శక్తిగల ధార్మిక వేత్తగా ఎనలేని ఖ్యాతి నార్జించారు. '...రాజకీయాలలో కాకుండా పూర్తిగా సాహిత్య సృష్టికి అంకితమై ఉంటే, అతను అరబ్ కవితపై శ్రద్ధ వహిస్తే, ఇంకొక 'ముతాన్నబీ' గానో 'బడి ఉజ్జమాని' గానో ఖ్యాతిపొంది ఉండేవారని, మత సంబంధమైన విశ్లేషణలు సంస్కరణల మీద దృష్టి నిల్పి ఉంటే తన తరానికి చెందిన 'ఇబ్నీ తాయ్‌మియా' గా రూపొందేవారని..' ప్రముఖ ఉర్దూ పండితుడు నియాజ్ ఫతేపూరి చేసిన ప్రశంసాపూర్వక వ్యాఖ్యానానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అన్నివిధాల అర్హులవటంలో ఏమాత్రం సందేహం లేదు.

ప్రజాజీవన రంగాలలో పలు పాత్రలను అద్భుతంగా నిర్వహించి, జీవిత చరమాకం వరకు తాను నమ్మిన లౌకిక ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు కట్టుబడి ఉత్కృష్టమైన జీవితాన్ని సాగించి, మాతృదేశ సేవలో తరించిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ 1958 ఫిబ్రవరి 22న కన్నుమూశారు. ◆



SYED NASEER AHAMED

ABOUT AUTHOR :

SYED NASEER AHAMED, who was writing since 1998 exclusively on THE ROLE OF MUSLIMS IN THE STRUGGLE FOR THE FREEDOM OF INDIA in Telugu language has 18 books to his credit. Being an advocate of democratization of knowledge, he has mailed the PDF files of all his books to more than 20,000 intrested through out the world. Some of his books have been translated into English, Hindi, Urdu and Tamil languages. He can be contacted :+ 91 9440241727, naseerwriter2020@gmail.com

- PUBLISHERS.

# చివర్లో మీతో ఓ మాట...

**ఈ** పుస్తకంలోని సమాచారం ఒక సుదీర్ఘ వ్యాసం. మౌలానా అబుల్ కలాం ఆజాద్ 132వ జయంతి సందర్భంగా ఆయన జీవిత విశేషాలను క్లుప్తంగా వివరిస్తూ ఓ కరపత్రం వెలువరిస్తే బాగుంటుందని శ్రీ సయ్యద్ అబ్దుల్ హమీద్ (DISTRICT MINORITIES WELFARE OFFICER, Potti Sreeramulu Nellore District, AP) గారికి ఆలోచన వచ్చింది. ఆ ఆలోచనను ఆయన నాతో పంచుకున్న సందర్భంగా నేను నా వద్ద సిద్ధంగా ఉన్న వ్యాసం గురించి చెప్పాను. ఆఘమేఘాల మీద ఆ వ్యాసాన్ని తెప్పించుకుని చదివిన శ్రీ హమీద్ వ్యాసాన్ని చిన్న పుస్తకంగా మలచి ప్రచురిద్దామన్నారు. ఆ విషయాన్ని తెలుసుకున్న SEEMANDHRA MUSLIM WELFARE ASSOCIATION (SAMWA) నెల్లూరు జిల్లా బాధ్యులు శ్రీ షేక్ జకీర్ హుస్సేన్ తమ అసోసియేషన్ పెద్దలతో సంప్రదించి పుస్తక ప్రచురణ భారాన్ని భరించడానికి సంసిద్దత వ్యక్తం చేశారు. నా వ్యాసాన్ని అధ్యయనం చేసిన SAMWA బాధ్యులు ప్రచురణకు అవసరమైన లాంఛనాలన్నీ వెంట వెంటనే పూర్తిచేశారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ గురించి విద్యార్థులకు సంక్షిప్త పరిచయం చేయాలన్న ఆలోచనతో కార్యాచరణకు పూనుకున్న శ్రీ హమీద్ SAMWA వారి సానుకూల నిర్ణయం పట్ల సంతోషం వ్యక్తంచేస్తూ నెల్లూరు జిల్లా కలక్టర్ శ్రీ కె.వి.యన్ చక్రధర్ బాబు IAS దృష్టికి తీసుకెళ్ళారు. కలక్టర్‌గారు కూడా ఆనందిస్తూ నన్నూ, ప్రచురణ భారాన్ని స్వీకరించిన SAMWA బాధ్యులను అభినందిస్తూ తన సందేశాన్ని శ్రీ హమీద్ గారి ద్వారా అందజేశారు. ఆ విధంగానే శ్రీ హమీద్ గారు కూడా తన అభినందనలు పంపారు. ఈ మేరకు పలువురి సహాయ-సహకారాలు త్వరితంగా అందడంతో పాఠకుల చేతుల్లో ఉన్న **'బహుముఖ ప్రజ్ఞాశాలి, స్వాతంత్ర్య సమరయోధులు, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్'** రూపుదిద్దుకుంది.

ఈ సందర్భంగా ప్రచురణ భారాన్ని స్వీకరించి నా వ్యాసం **'బహుముఖ ప్రజ్ఞాశాలి, స్వాతంత్ర్య సమరయోధులు, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్'** పుస్తకంగా రూపు దిద్దుకోవడానికి ఆర్థిక చేయూత ఇచ్చిన SEEMANDHRA MUSLIM WELFARE ASSOCIATION వివరాలు పాఠకులకు పరిచయం చేయడం నా బాధ్యతగా భావిస్తున్నాను. మన దేశం నుండి కువైట్ వెళ్ళి అక్కడ ఉద్యోగాలు చేస్తున్న మిత్రుల ఆలోచనల మేరకు 2017 మార్చి 10న SAMWA ఏర్పడింది. ఈ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులుగా షేక్ యజ్దాని బాషా (కడప), వ్యవస్థాపక కార్యవర్గ సభ్యులుగా షేక్ ఖలీల్ బాషా (కడప), షేక్ సజ్జాద్ (నెల్లూరు), మహమ్మద్ హనీఫ్ (కడప), అబ్దుల్ ఘని బాదూషా (విశాఖపట్నం), M S K మొహియుద్దీన్ (గుంటూరు),

షేక్ ముజిబుర్ రెహమాన్ (విశాఖపట్నం) నిర్మాణమయ్యింది. ఆ తరువాత 2017 మే మాసంలో ఆంధ్రప్రదేశ్‌లో రిజిస్టర్ అయ్యింది. అప్పటి నుండి విశాఖపట్నం, కడప, నెల్లూరు నగరాలలో జిల్లా కార్యాలయాలను ఆరంభించిన SAMWA విద్యా, ఉద్యోగ, సామాజిక-ఆర్థిక రంగాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ముస్లింలు ఇరత వెనుకబడిన వర్గాల సంక్షేమం, అభ్యున్నతి లక్ష్యంగా తగిన కార్యాచరణను రూపొందించుకుని ఆ దిశగా కృషి చేస్తున్నది. సమకాలీన పరిస్థితులు, సామాజిక, ఆర్థిక, విద్య, చరిత్ర తదితర అంశాల మీద సమాచార పరంగా ప్రజలను ప్రధానంగా యువతను చైతన్యవంతుల్ని చేయడానికి నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా 'భారత స్వాతంత్ర్యోద్యమంలో హిందూ-ముస్లింల ఐక్యత' అను అంశం మీద On line ప్రసంగం ఏర్పాటు చేసి నా ప్రసంగాన్ని వందలాది శ్రోతలకు అందించింది. ప్రస్తుతం **'బహుముఖ ప్రజ్ఞాశాలి, స్వాతంత్ర్య సమరయోధులు, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్'** ముద్రించి వేలాది విద్యార్థులు, యువతలో దేశభక్తి, మతసామర్యం, వివిధ సామాజిక జనసముదాయాల మధ్యన స్నేహం-సౌభాతృత్వ భావనలను మరింత పటిష్ట పర్చేందుకు, స్వయం కృషి, స్వావలంబన, జ్ఞానార్జన పట్ల నిబద్దతతో కూడిన సత్సంకల్పాన్ని ధృఢతరం చేయడానికి వివిధ కార్యక్రమాలను చేపడుతుంది.

ఆరంభంలో నేను తెలిపినట్టుగా ఈ పుస్తకంలోని విషయం ఒక వ్యాసం మాత్రమే. ఈ వ్యాసంలో మహనీయుడు **మౌలానా అబుల్ కలాం ఆజాద్** వ్యక్తిత్వాన్ని పూర్తిగా ఆవిష్కరింప చేయడం అసాధ్యం. ఆయన జీవిత విశేషాలను రేఖామాత్రమంగా ఇందులో పొందు పర్చే ప్రయత్నం మాత్రమే నేను చేశాను. ఈ కృషిలో నేను ఎంతమాత్రం విజయవంతం అయ్యానో పాఠకులు నిర్ణయించాలి.

ఈ సందర్భంగా **'బహుముఖ ప్రజ్ఞాశాలి, స్వాతంత్ర్య సమరయోధులు, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్'** పుస్తక ప్రచురణను అభినందించిన **Sri. K. V. N. CHAKRADHAR BABU IAS,** (District Magistrate & Collector, Sri Potti Sreeramulu Nellore District, AP) గారికి, సుదీర్ఘ వ్యాసం కాస్త పుస్తకంగా రూపుదిద్దుకోవడానికి ఆర్థికంగా సహకరించిన SEEMANDHRA MUSLIM WELFARE ASSOCIATION మిత్రులు శ్రీ షేక్ యజ్దాని బాషా (Kuwait), షేక్ జకీర్ హుస్సేన్ (Nellore) లకు, ఈ పుస్తకం ఆలోచనను నా మదిలోకి పంపి ఆ ఆలోచన కాస్తా పుస్తకంగా రూపు దిద్దుకొనేవరకు సహకరించిన మిత్రులు శ్రీ అబ్దుల్ హమీద్ (District Minorities Welfare Officer, Sri Potti Sreeramulu Nellore District, AP) గారికి, ఈ పుస్తకాన్ని అందంగా ముద్రించి ఇచ్చిన వినుకొండ 'జయదీప్తి గ్రాఫిక్స్' మిత్రులు శ్రీ నలబోతుల జయరాజు గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. ◆

**- సయ్యద్ నశీర్ అహమ్మద్.**

# SAMWA

## SEEMANDHRA MUSLIM WELFARE ASSOCIATION

## సీమాంధ్ర ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్

Registred in Andhrparadesh, India Regn No. 120/2017

## OUR AIMS & OBJECTIVES

**Upliftment of community in education, employment, social and economic sectors by supporting and offering free guidance**

### VISHAKAPATNAM OFFICE

**SK. KHWAJA BABU (Office Incharge)**
MIG : 330 ,No. 39-33-17/2
Madhavadhara, Beside RTO Office, VUDA
**VISHAKAPATNAM - 18,**
Vishakapatnam Dist., Andhrapradesh
**Mobile : 8897508843**

### KADAPA OFFICE

**SK. SANDANI BASHA (Office Incharge)**
Burhanuddin Masjid Rooms, Bellam Mandi
**KADAPA - 516001,**
YSR Kadapa Dist., Andhrapradesh
**Mobile : 9490276644**

### NELLORE OFFICE

**SK. Zakeer Hussain (Office Incharge)**
Ist Floor, Basha Masjid Complex, Chinna Bazar,
**NELLORE - 524001,**
Nellore Dist., Andhrapradesh
**Mobile : 9246420786**